
# ఏమీ కాని నేను

మన్నెం శారద




యశోధర కళ్ళు తెరిచి చుట్టూ చూసింది.

దీపాలు మసకగా వెలుగుతున్నాయి. అడపా దడపా చంటిపిల్లల ఏడుపులు, తల్లుల జోకొట్టడాలు తప్పించి వా ర్డంతా దాదాపు నిశ్శబ్దంగా ఉంది.

యశోధర పక్కకి వత్తిగిల్లబోయింది. పొత్తికడుపులో మెలి తిప్పినట్లు పోట్లు.

భరించలేని బాధతో "అమ్మా!" అంది.

ఎవరికో ఇంజక్షన్ చేయడానికి అటుగా వెళ్తోన్న సిస్టర్ ఆమె దగ్గరగా వచ్చి "ఎలా ఉంది?" అంది.

"బాగా నొప్పిగా ఉంది సిస్టర్!"

సిస్టర్ స్క్రీన్ పెట్టి చూసింది.

ఆమె చీ రంతా ఫర్రగా తడిసిపోయింది. "మై గుడ్‌నెస్! ఓవర్ బ్లీడిం గవుతోంది!" అంటూ డాక్టర్ని పిలుచు కొచ్చింది.

డాక్టర్ వచ్చి కండిషన్ చూసి వెంటనే లేబర్ రూమ్‌లోకి తీసుకురమ్మంది.

సిస్టర్ ఆమెను బల్ల మీద పడుకోబెట్టి కళ్ళ మీద దూది పెట్టి బాండేజ్ కడుతుంటే, "ఎందుకు?" అంది యశోధర భయంగా.

"ఊరికే ప్రశ్న లెయ్యక పడుకోమ్మా!" అంది సిస్టర్ చిరాగ్గా.

యశోధర ఊపిరి బిగబెట్టి కొయ్యలా పడుకొంది.

ఆమె రెండు కాళ్ళను బల్లకి అటూ ఇటూ ఉన్న రాడ్స్‌కి బెల్టుతో బంధించింది సిస్టర్.

ఏవో కత్తెర్ల, కత్తుల శబ్దాలు.

ఆమె శరీరం హిమపాతం సోకినట్లు వణికింది.

"భయం లేదులే! కాని... చదువుకొని ఈ పని ఎందుకు చేశావ్?" అంది డాక్టరు కొంత ఊరడింపు, మరికొంత మందలింపు కలగలిపిన కంఠస్వరంతో.

ఏ వనో తెలియక మౌనం వహించింది యశోధర.

"ఎబార్షన్ లీగలై జయ్యాక కూడా మీ రిలాంటి నాటు మందులు మింగి ప్రాణాల మీదకి తెచ్చుకొం టుంటే ఏదైనా జరిగితే అది డాక్టర్ల మీదకి రాదూ?"

యశోధర అంత బాధలోనూ త లూపింది.

సున్నితమైన శరీర భాగంలోకి కరుకైన కత్తి ప్రవేశించి కదిలించి కెలుకుతుంటే యశోధర ఆ బాధని భరించలేకపోయింది. వళ్ళ బిగువున పెదవుల్ని బిగించినా మూసిన కనురెప్పల కిందుగా కన్నీరు జారి చెంపల్ని తడిచేస్తోంది.

"కొంచెం ఓర్చుకోవాలి!" అంది డాక్టరు.

ఆ వెంటనే గర్భంలో బలవంతా న పిండాన్ని లాగెయ్యడం వలన కలిగిన బాధకి కెవ్వు మంది యశోధర.

"ష్! అప్పు డింత బాధపడాలని తెలియదా?" అంది నర్స్ కాస్త మోటుగా.

"తప్పు సిస్టర్, ఆడదానివై ఉండి చాలా తెలివిగా మాట్లాడుతున్నా ననుకోకు" అంది డాక్టరు కోపంగా.

యశోధర బాధలోంచి మగతలోకి జారిపోయింది.

డ్రెస్ చేయడం ముగించి ఆమెను వార్డులోకి తీసుకొచ్చారు.

"చాలా బ్లడ్ పోయింది. వెంటనే బ్లడ్ ఎక్కించాలి" అని చెప్పి మరో కేసు చూడ్డానికి వెళ్ళిపోయింది డాక్టరు.

*** *** ***

యశోధరకి స్పృహ వచ్చేసరికి సాయంత్రం నాలుగ్గంట లవుతోంది. అప్పుడే వార్డులోకి విజిటర్స్ రావడం ప్రారంభించారు.

యశోధర పక్క బెడ్ మీద ఓ కమ్మాయి ఉంది. ఆమె పక్కన ఆమె తల్లి ఉంది. ఆమె భర్త కాబోలు బుట్ట నిండా పళ్ళు, హార్లిక్స్ తీసుకుని వచ్చాడు. ఆదరంగా అల్లుణ్ణి చూసి అత్తగారు మర్యాదగా లేచి నిలబడి తను కూర్చున్న స్టూలు అతని కిచ్చింది.

"పర్వాలేదండి' అంటూనే అతను కూర్చుంటూ,"ఎలా ఉంది?" అ నడిగేడు భార్య వైపు చూస్తూ.

"ఏం బాగుంటుం దండీ? చాలా రక్తం పోయిందంట. అయిదో నెలలో ఇంత పని చేస్తారా, తల్లి ప్రాణం దక్కాల్సింది కాదని డాక్టరమ్మ చాలా కేక లేశారండి!" అంది అత్తగారు నిష్ఠురంగా.

అత నేం జవాబు చెప్పలేనట్లు తల దించు క్కూర్చున్నాడు.

"మీ పె ళ్ళేం చిన్నతనాన జరిగిందనా ఇంత పని చేశారు? నాకు మొదటి కాన్పుకి పదమూడో సంవత్సరం. కడు పొస్తే కనడమో, దానంతట అది పోవడమో కాని ఈ రకం బలవంతపు స్రావాలు మే మెరుగం. ఒక మాట పెద్దోళ్ళని అడగటం ఉండాలి. మొదటి బిడ్డ ఆరోగ్యం, తెలివి తర్వాత పిల్లలకి రావంటారు" అం దామె గడగడా.

అల్లుడి మొహం ఎర్రబడింది.

వెంటనే ఆ అమ్మాయి అది గమనించి తల్లి

వైపు మందలింపుగా చూసి ఊరుకోమని సంజ్ఞ చేసింది.

ఆవిడ కాస్త కోపంగా వార్డు బయట కెళ్ళి నిలబడింది.

"మీ అమ్మగారికి కోపం వచ్చినట్లుంది అయినా మూడో నెలని నా కెందు కబద్ధం చెప్పేవు? అయిదో నెలలో అబార్షన్ చేసుకోమని చెప్పడానికి నేను రాక్షసుణ్ణా? నువ్వేగా ఇ దంత చేసింది?" అన్నాడు భార్యతో బాధగా.

ఆమె అతని చేతిని పట్టుకొని మురిపెంగా చూస్తూ "అమ్మ మాటల్ని పట్టించుకోకండి. నాకే... పిల్లలు ఇష్టం లేక అలా అబద్ధం చెప్పాను. ఇంత సీరియ స్పవుతుందనుకోలేదు" అం దామె నవ్వుతూ.

"నీకు న వ్వెలా వస్తుంది? నీ కేమన్నా అయితే నా గతి ఏంటి? నే నసలు బ్రతగ్గలనా?" అన్నా డతను ఆమె వైపు ఎంతో ప్రేమగా చూస్తూ.

"అందుకే చేశాను. మీ ప్రేమనీ, అనురాగాన్నీ పూర్తిగా అనుభవించకుండానే ఈ లంపటం దేనికి? పిల్లలు పుడితే మీరు నా ప్రేమలో కొంత భాగం మైనస్ చేసేస్తారని నా భయం. అందుకే ఇంతగా ప్రాణాలకి తెగించి ఈ పనికి పూనుకున్నాను" అం దా అమ్మాయి నీరసంగా నవ్వుతూ.

అతను ఆమె వైపు ఆరాధనగా చూస్తూ- "పిచ్చీ! నీ తర్వాతే నా కెవ రయినా. నిన్ను ప్రేమించనని ఇంత పనికి తెగిస్తావా? ఎంత బాధపడ్డావో చూడు!" అన్నాడు లాలనగా.

ఆమె కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

"నన్ను స్వార్థపరురా లనుకోండి. ఏమైనా అనుకోండి. మీ ప్రేమని ఎవరికీ పంచలేనండీ - చివరికి పిల్లలకి కూడా" అం దామె ఉద్వేగం మిళితమైన కంఠస్వరంతో.

అత నామె తల నిమిరి పై మవడం వలన వెళ్ళిపోతుంటే యశోధర ఆ ఇద్దరి వైపూ చిత్రంగా చూసింది.

వెంటనే ఆమె కళ్ళలో నీళ్ళు నిండుకోసాగాయి. ఆమె తల తలగడలో దూర్చింది.

వివేక్. ఇంతవరకూ రాలేదు.

త నంటే అంత అలక్ష్యమా? మోసగించాడా?

అందుకు ఆమె మనసు ఏమాత్రం అంగీకరించలేదు.

అతని కళ్ళలో నిజాయితీ, అతని మాటల్లో అమాయకత్వం, ప్రేమలో నిష్కల్మషత - మాత్రమే ఆమెకు తెలుసు.

జీవితంలో ప్రే మంటే ఏమిటో - దాని అవసరం ఎంతో అతని వల్లనే తెలుసుకొంది.

అతను తనని పసిపాపలా లాలించాడు. తన ఇండివిద్యుయాలిటీని గౌరవించేడు. తనని తనను గా ప్రేమించేడు. వాటిని తను వదులుకోలేకపోయింది.

తల్లి ప్రేమ ఎరుగని తనని - తన జీవిత నికీ, జీవిత నికీ తననిగా వదిలేసిన అన్నా వదినల ప్రేమ రాహిత్యానికి గురైన తనని వెంటాడి, ప్రేమ చూపులతో వేటాడి గెలిచిన ప్రేమ విలుకాడు.

తనకి ముల్లు గుచ్చుకుంటే అతని కళ్ళలో మెరిసే నీరు, తను అతనివేపు ఒక సెకను చూడకపోతే విల విల లాడే అతని మనసు - తనకి ఎంతో గర్వాన్ని ఆనందాన్ని కలిగించేవి. అందుకే... తప్పో... తప్పని తెలిసో... తను అతనికి స్వంత మైపోయింది.




అతనికి అదివరకే వివాహమైం దన్న విషయం మనసులో ముల్లులా గుచ్చుకున్నా అతని ప్రేమ కోసం ఆ బాధని భరించింది.

అతని మనసు తనదే అని సరిపుచ్చుకుంది.

"యశూ! నువ్వు తప్పు దారిలో నడుస్తున్నావు. అతను మగవాడు. భార్య అరోగ్యం బాగోక పుట్టింట్లో ఉంది. అవసరానికి నీతో ప్రేమ నటిస్తున్నాడు. తర్వాత నీ జీవితం ఏ మవుతుంది?" అంటూ గట్టిగా కేక లేసింది ఆమె స్నేహితురాలు, రూమ్మేట్ సుమలత.

"లేదు సుమా. అత నలాంటివాడు కాదు. నా కా నమ్మకం ఉంది" అంది యశోధర ఆమె మాటల్ని ఖాతరు చెయ్యకుండా.

సుమలత యశోధర వైపు చూసి జాలిగా అంది- "మగవాడి ప్రేమ అవసరం తీరే వరకే. కనిపించని ఆ ప్రేమ కోసం జీవిత మంతా ఉంపుడుకత్తెనే పేరు భరిస్తావా? నలుగురూ చేసే అవహేళనకి తల వంచుత వా?"

యశోధర తేలిగ్గా నవ్వి "నిజంగా అతని ప్రేమ కోసం ఎలాంటి అవమానా న్నైనా భరిస్తాను సుమా. ప్రేమ రాహిత్యంతో నిరర్థకమైన ఈ సుదీర్ఘమైన జీవిత న్ని సాగించలేను"అంది.

"ఎదు ర్రాయి తగిలేవరకు నీకు అర్థం కాదులే" అంటూ వెళ్ళిపోయింది సుమలత కాస్త కోపంగా.

సుమలత కోపం కాగితపు మంట లాంటి దని యశోధరకి తెలుసు.

ఆ రాత్రి వివేక్ గుండెల మీద తల ఉంచి అతను తల నిమురుతుంటే సుమలత అన్న మాటల్ని చెప్పింది యశోధర.

"నువ్వు నమ్ముతున్నావా?"

"లేదు లేదు వివేక్" అంది యశోధర ఎంతో నమ్మకంగా.

ఆ సాయంత్రం ఆమెను గుడికి తీసుకెళ్ళి జేబులోని నల్లపూసలు తీసి ఆమె మెడలో వేసి- "నువ్వు నా భార్యవి. ఇంకా చెప్పా లంటే యు ఆర్ మోర్ దౌన్ మై లైఫ్" అన్నాడు ఉద్వేగ్నత నిండిన కంఠంతో.

దానికే ఎంతో పొంగిపోయింది యశోధర.

*** *** ***

మూడు రోజులుగా ఆమె వివేక్ కోసం ఎదురుతెన్నులు చూస్తోంది.

ఏదో భయం. తెలియని ఆందోళన. అదేనా? అది నిజమేనా? అయితే... అయితే అందరూ తనని వే లెత్తి చూపిస్తారా?

యశోధర దిగులుగా పడుకొని ఆలోచిస్తుంది.

ఆఫీసు నుండి సుమలత రావడమే నిస్తేజంగా పడుకొని ఉన్న యశోధర వైపు చూస్తూ, "ఏం జరిగింది?" అంది.

యశోధర జవాబు చెప్పలేదు.

సుమలత మెల్లిగా దగ్గరగా వచ్చి "నిన్నే- ఏం జరిగిందే?" అంది కసురుతున్నట్లుగా.

యశోధర తల దించుకుని, "పీరియడ్స్ రాలేదు" అంది దిగులుగా.

సుమలత కళ్ళు పెద్దవి చేసి "మై గాడ్. ఈ సంగతి అతనికి చెప్పావా?" అంది.

"అతను రాలేదు."

సుమలత జాలిగా యశోధర వైపు చూసి, "నేను చెబితే విన్నావా? గురుడు తప్పించుకున్నాడు!" అంది.

"లేదు, సుమా, అత నలాంటివాడు కాదు.అతని కెలా ఉందో అని భయంగా ఉంది. ఈ మధ్య దగ్గుతున్నాడు బాగా" అంది యశోధర ఆందోళనగా.

సుమలత యశోధర వైపు కోపంగా చూసి, "ని న్నా దేవుడు కూడా కాపాడలేడు. ఇం కేం- కని జోలలు పాడు" అంది.

యశోధర ఆ మాటకి చిన్నగా నవ్వి- "నాకూ అలాగే అనిపిస్తూందే సుమా. ఆ పుట్టబోయే వాడు వివేక్ కన్నా గొప్పవా డవుత డేమో? వివేక్ లానే నిటారైన ముక్కు, చిన్న నోరు..."

"నా శ్రాద్ధం, నీ పిండాకూడు! నీ కతని మీద మైకంతో కళ్ళు మూసుకుపోయాయి. ఆ పోలేరమ్మ వస్తేగాని నీ జాతర చెయ్యదు" అంది సుమలత విసురుగా.

"పోలేరమ్మ ఎవరు?"

"అతగాడి లీగల్ పెళ్ళాం"

"చాలా మంచిదట. ఇతని మాటకి నో రెత్తదట."

"ఆహా! తమ మాట విన్నంత వరకూ పెళ్ళా లంత పతివ్రతలే. తనకి సవతిని తెస్తా నంటే... ఏ పెళ్ళాం ఊరుకొంటుందే? చీపురు తిరగేస్తుంది. చివరికి దిక్కుమాలేది నువ్వే. వెంటనే చేసిన త ప్పేదో చేశావు కాని... డాక్టరు దగ్గరకి తగలడు" అంది సుమలత మందలింపుగా.

కాని యశోధరకి అప్పుడే మనసులో ఏదో తెలియని మమకారం క్షణ క్షణానికీ వరదకి పెరిగే నీటిమట్టంలా పెరగసాగింది.

రాత్రులు అలాగే మెలకువగా ఉండి పొట్ట మీద చెయ్యి వేసుకుని మమకారంగా తడుముకొనేది.

వారం రోజులు దాటింది. వివేక్ జాడ లేదు.

యశోధరలో బెంగ, అనుమానం చోటు చేసుకోసాగేయి. సుమలత హెచ్చరికలు నిజమే

అనిపించసాగింది.

తన పరిస్థితి ఏమిటి అన్నదాని కన్నా... తనని అతను ప్రేమ పేరుతో వంచించా డన్నది ఆమె భరించి జీర్ణించుకోలేకపోయింది.

ఆ రోజు బాధతో, కసితో ఆమె మింగిన మందు ప్రాణాంతక మైంది. సుమలత గాభరాగా ఆమెను ఆస్పత్రిలో అడ్మిట్ చేసింది.

యశోధర అతని జ్ఞాపకాలతో కరిగి కళ్ళ నుంచి స్రవిస్తున్న బాధని తలగడకి అర్పితం చేసింది.

"మీవా ళ్ళెవరూ లేరూ?" ప క్కమ్మాయి తల్లి యశోధరని చూస్తూ అడిగింది.

యశోధర తల అడ్డంగా తిప్పింది.

"మీ ఆయనో?" ఆవిడ అంతటితో వదలడం ఇష్టం లేనట్లుగా అడిగింది.

"లేరు."

ఆవిడ కళ్ళు పెద్దవి చేసి "అసలు లేడా? ఊళ్ళో లేడా?" అంది.

యశోధర కళ్ళు మూసుకుంది వినట్లుగా.

"తెలియడంలే, పెళ్ళి కాకుండా కాలు జారిన రకం అని?" అం దామె కూతురితో గుస గుసగా.

యశోధర పక్కకి తిరిగి బాధగా నవ్వుకొంది - "నువ్వు మొగుడి ప్రేమలో పిల్లలకి భాగం పెట్టడానికి ఇష్టం లేక కడుపు తీయించుకున్నావు. నేను లోకానికి జవాబు చెప్పలేక తల్లి హృదయాన్ని చంపుకొని నా ప్రియుడి ప్రతిరూపాన్ని ప్రాణం పోసుకోనివ్వకుండా చేశాను. మెడలో మంగళసూత్రం లేనంతమాత్రాన మాతృ హృదయంలో చెలరేగే అనుభూతులు వివాహిత తలులకి అతీతంగా ఉండవు" అనుకొంది మనసులోనే.

ఆ మర్నాడు సుమలత వచ్చి యశోధరని తీసుకెళ్ళింది రూమ్‌కి.

"జవిగిం దేదో జరిగింది. ఇక ఆ గూస్‌ని రానివ్వకు" అంది సుమలత.

యశోధర మాట్లాడలేదు.

*** *** ***

యశోధర ఆ రోజు ఆఫీసుకి బయలుదేరపోతుంటే వివేక్ ఎదు రొచ్చాడు.

యశోధర బాధగా మొహం తిప్పుకొంది.

"కోపం వచ్చిందా?" అన్నాడు వివేక్.

"లేదు. చాలా సంతోషంగా ఉంది" అంది యశోధర.

"అబ్బో, చాలా వేడి మీద ఉన్నావు. పద లోపలికి వెళ్ళి మాట్లాడుకొందాం."

"మాట్లాడుకోవడానికి ఏం లేదు. నాకు ఆఫీసుకి టై మవుతోంది" అంది యశోధర ముభావంగా.

"మరీ బెట్టు చేయకు. నా కేం జరిగిందో, నే నెందుకు రాలేదో తెలుసుకోవా?" అత నామె చెయ్యి పట్టుకుని లోపలికి గుంజాడు.

యశోధరకి అతన్ని చూసి దుఃఖం ముంచు కొచ్చింది.

"ఏం జరిగింది? ఎందుకు బాధపడుతున్నావు?" అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు వివేక్.

ఆ పలకరింపుకే కరిగిపోయింది యశోధర. జరిగిన సంగతి ఏడుస్తూనే చెప్పింది.

వివేక్ నివ్వెరపోతూ, "ఎందు కంత తొందరపడ్డావు? నేను రా ననుకొన్నావా? నేను మోసగా ణ్ణనుకొన్నావా?" అన్నాడు బాధగా.

"నన్ను చూడకుండా ఒక్క రోజు ఉండలే ననేవారు. నేను లేకపోతే చచ్చిపోత ననేవారు. సరిగ్గా కావాల్సివచ్చినప్పుడు కనిపించకుండా పోయారు. మీ కోసం ఎన్నిసార్లు ఫోను చేసినా లేరనే జవాబే వచ్చింది."

"అవును యశూ! నేను ఊ రెళ్ళేను."

"ఎక్కడికి?"

"కుసుమకి బాగోలేదు."

యశోధర మొహం ఆ జవాబు విని అదోలా అయింది.

"అక్కడ సరైన డాక్టర్ లేరని తీసుకొచ్చేశాను."

"ఏంటి జబ్బు?"

"జనరల్ వీక్‌నెస్. పైగా ఇంతవరకు కన్‌సీవ్ కాలేదని బాధపడుతోంది. నేను సరిగ్గా తనతో ఉన్న దేది?" అన్నాడు వివేక్.

అతని జవాబుకి హర్టయి నట్లయింది యశోధర. మౌనంగా కూర్చుంది.

"ఏం అలా ఉన్నావు? ఈసారి ఇలా జరక్కుండా జాగ్రత్తపడదాం. నీ దగ్గర డ బ్బేమైనా ఉందా?"

యశోధర కాదనలేకపోయింది. "ఎంత కావాలి?"

"ఒక అయిదు వందలు. మళ్ళీ రాగానే ఇచ్చేస్తాను."

యశోధర అదోలా నవ్వి లోపలి కెళ్ళి తీసుకొచ్చి ఇచ్చింది.

వివేక్ ఆమెను దగ్గరికి తీసుకొని బలంగా ముద్దు పెట్టుకొని "నా స్వీట్ డార్లింగ్! నువ్వు


## తెల్లమచ్చలు

కొత్త పరిశోధన! తెల్లమచ్చలు, ఇతర చర్మవ్యాధులు వున్నవాళ్ళు బాధపడనవసరం లేదు. అట్టివాటి వివరాలు ఇంగ్లీషులో తెలిపి రెండు చిన్న సీసాల మందు వుచితంగా పొందండి. మా మందు వాడడం మీరు ప్రారంభించగానే మీ తెల్లమచ్చలు మాయమవడం ప్రారంభమగును. చాలామంది ఈ విధమైన నివారణ పొందరు. మీరూ ప్రయత్నించి లాభం పొందండి. అర్హతలు, అనుభవం వున్న వైద్యుని ద్వారా చికిత్స పొందండి.

## తెల్లవెంట్రుకలు

హేర్ డైతో కాదు. మా ఆయుర్వేద నూనెతో చిన్న వయస్సులో వెంట్రుకలు తెల్లపడడం ఆటంకపర్చవచ్చును. మొదలునుండే నల్ల జుట్టు రావడం మొదలై జుట్టుని తెల్లపడనీయకుండా కాపాడును. ఈ నూనె కళ్ళకి, మెదడునకు లాభదాయకమైనది. వేలమంది లాభం పొందారు. ఈ చికిత్స ద్వారా మీకు ఫలితం దక్కనిచో మీ డబ్బు వాపస్ ఇవ్వబడును. ఒకసారి ప్రయత్నించండి. ఒక చిన్న సీసా వెల రూ. 14/- మూడు సీసాల వెల రూ. 40/- మూడు సీసాలకి ఒకేసారి ఆర్డర్ ఇస్తే ఒక సీసా ఉచితం.

**VAIDYA B.H. MATHUR [B.H. 8]**
**KATRI SARAI [GAYA] HIND.**



## మీరు

* మంచిని ప్రేమించేవారా...?
* జీవితంలో నైతికపు విలువలకు ప్రాధాన్యమిస్తారా.....
* ఆధ్యాత్మిక భౌతిక అవసరాల సమన్వయాన్ని కోరుకుంటున్నారా...?

## అయితే

**గీటురాయి**
**వారపత్రిక**

మీరు చదవవలసిన పత్రిక

గీటురాయి వారపత్రిక
ఛత్తాబజార్, హైదరాబాద్ - 2.
ఫోన్: 521237

చాలా మంచిదానివి'' అన్నాడు.

యశోధర అతని భుజాల చుట్టూ చేతు లేసి పెనవేస్తూ "మళ్ళీ ఎప్పు డొస్తారు?'' అ నడిగింది ఆశగా.

"రేపు. ఈ రోజు తనని ఆస్పత్రికి తీసుకెళ్ళాలి."

"తప్పకుండా వస్తారు కదూ?''

"తప్పకుండా'' వివేక్ వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయేడు.

*** *** ***

"నువ్వు నా మాట ఖాతరు చెయ్యడంలేదు'' అంది సుమలత కాస్త కోపంగానూ, బాధగానూ.

"ఏ మాట?''

"వివేక్‌తో తెగతెంపులు చేసుకో యశూ. నువ్వింకా ఊబిలోకే దిగిపోతున్నావు.''

"లేదు సుమా. అతను నన్ను ఎంతో అభిమానించి ప్రేమిస్తున్నాడు. నేను లేకపోతే బ్రతకడు. ఆ ప్రేమ చాలు నాకు''

"అవును. అతనికి నీ పట్ల బాధ్యతేముంది?తిండి పెట్టాలా? బట్ట కొనాలా! చివరికి నీవు అతని మూలంగా హాస్పిటల్ పా లైతే తొంగి చూడాలా! అవసరమైతే అప్పు చేసి మరీ డబ్బు ఎదు రివ్వగలవు. ఎప్పుడో ప్రాణం కూడా అడుగుతా డులే!''

"ఛ! మరీ అన్యాయంగా మాట్లాడకు. నాకు ఉద్యోగ ముంది. అత నెందు కివ్వాలి? భర్తకి అవసరమైతే భార్య ఇవ్వకూడదా? అతను ఊళ్ళో ఉంటే గదా ఆనాడు హాస్పిటల్‌కి రావడానికి? తర్వాత తెలిసి ఎంత బాధపడ్డాడో తెలుసా?'' అంది యశోధర.

సుమలత పక పకా నవ్వింది యశోధర మాటకి.

"ఎందుకు నవ్వు?'' యశోధర కోపంగా చూసింది స్నేహితురాలి వైపు.

"నీ అమాయకత్వానికి. నువ్వు హాస్పిటల్లో ఉన్న రోజు వివేక్ ఊళ్ళోనే ఉన్నాడు. పెళ్ళాం ఊరి నుంచి వచ్చింది. నేను చీర కొనుక్కుందామని అవంతి కెళ్తే ఆవిడకి చీరలు కొంటున్నాడు. అక్కణ్ణుంచి అమరావతికి సినిమాకి వెళ్ళడం కళ్ళారా చూశాను.''

సుమలత మాటలకి యశోధర కళ్ళలో నీళ్ళు నిండాయి.

"ఇ దంతా నిజమా?'' అంది కన్నీరు ఆపుకొంటూ.

సుమలత ఆమె దగ్గరగా వచ్చి "అబద్ధం చెప్పి నిన్ను బాధపెడితే నా కే మొస్తుంది? ఆ రోజే చెబితే నువ్వు ఫీ లవుతా వని దాచాను. రోజూ వా ళ్ళిద్దరూ స్కూటరు మీద ఎక్కడో చోట కనిపిస్తూనే ఉంటారు. అతను భార్యని అపురూపంగా చూసుకుంటున్నాడు. ఇక నీ దగ్గరికి డబ్బు కోసం తప్ప రాడు'' అంది.

యశోధర దుఃఖం ఆపుకోలేక స్నేహితురాల్ని గట్టిగా పట్టుకొంది.

"ప్లీజ్, ఏడవకు. జరిగిపోయింది పీడకలలా మరచిపో. అతను విదిలించే ముష్టి ప్రేమ కోసం విలువైన జీవితాన్ని పాడుచేసుకోకు. నీ తెలివితేటల్నీ, చదువునీ సానపెట్టి సార్థకం చేసుకో. వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకో'' అంది సుమలత అనునయంగా.

"కాని... కాని...''

"ఏంటో చెప్పు''

"నేను మళ్ళీ ప్రెగ్నెంట్‌ని సుమా'' అంటూ తల దించుకుని ఏడ్చింది యశోధర.

సుమలత కళ్ళు ఆశ్చర్యంతో పెద్ద వయ్యాయి.

"మళ్ళీ బుద్ధి తక్కువగానే ప్రవర్తించేవా?''

"అతను... అతను... కావా లంటే... నే!''

"అతను కావా లన్నాడా? సరిగ్గా చెప్పు'' అంది సుమలత కోపంగా.

"అవును సుమా. ఆవిడకి పిల్లలు పుట్టరని డాక్టర్లు చెప్పేరట. వివేక్‌కి పిల్ల లంటే చాలా ఇష్టం. అందుకని నా వల్ల కని పాపని ఆమెకిస్తా నన్నాడు. అందుకు ఒప్పుకొన్నాను'' అంది అపరాధిలా తల దించుకొని.

"ఆహా! త్యాగమూర్తి! నీ డబ్బు నీ సుఖం అన్నీ త్యాగం చెయ్యడంతో పాటు అతని కోసం బిడ్డని కని లోకనింద పడటాని క్కూడా సిద్ధపడ్డా వన్నమాట. ఇంత పిచ్చివాళ్ళు కూడా ఉండటం అతని లాంటి పాలిట వరం!''

యశోధర జవాబు చెప్పలేదు.

సుమలత లేచి నిలబడింది.

"బాగా ఆలోచించుకో యశూ! మనను ప్రేమించిన వాళ్ళకి మనం ప్రాణం ఇచ్చినా తప్పులేదు. కాని మనను అవతలివాళ్ళు మన బలహీనత గ్రహించి అవసరాలకి వాడుకొంటున్నారని తెలిసి కూడా ఉపయోగపడటం క్షమించరాని బలహీనత!'' అంటూ వెళ్ళిపోయింది సుమలత.

ఆ సాయంత్రమే యశోధర తిరిగి హాస్పిటల్‌కి వెళ్ళింది.

రూమ్‌కి వచ్చిన వివేక్ చేతిలో ఓ చిన్న స్లిప్‌తో పాటు నల్లపూసలదండ అతని చేతిలో పెట్టింది సుమలత.


"ఏం టిది?'' అన్నాడు వివేక్ అందుకొంటూనే.

"చూడండి'' అంటూ అక్క ణ్ణుంచి వెళ్ళిపోయింది.

వివేక్ స్లిప్ తెరిచి చదివేడు.

"ప్రేమ రాహిత్యానికి గురైన నేను దానికోసం మీకు రెండో భార్యగా ఉండటానికీ, చివరికి లోకం చేత కీప్ అని అనిపించుకోవడానికీ సిద్ధపడ్డాను. డబ్బు గాని, నగలు గాని మామూలు భార్యల్లా అడిగి మిమ్మల్ని సతాయించలేదు. నన్ను నన్నుగా గుర్తించాలని, మీ ప్రేమ పొందితే చాలని ఆశపడ్డాను. అందుకే మీ కోసం బిడ్డని కనడానికి, మిమ్మల్ని తండ్రిని చేసి సంతోషపెడదామని కూడా తెగించేను. కాని... నేను ఒంటరిగా ఆస్పత్రిలో మీ రూపాన్ని తుడిచేయడానికి బల్ల ఎక్కినప్పుడు మీ రదే సమయానికి ఊరి నుండి వచ్చిన మీ ఆవిడకి నా దగ్గర తీసుకొన్న డబ్బుతో చీరలు కొని, షికార్లు తిప్పుతున్నా రన్న నిజాన్ని భరించలేకపోతున్నాను. ఇది అసూయ కాదు - ఆవేదన! నా కిప్పటికి తెలిసింది - ఏమీ కాను నేను!

పగిలిన హృదయాన్ని అతుకులు వేసుకుంటున్న నన్ను మ రెప్పుడూ కలిసే ప్రయత్నం చేయకండి - యశోధర.''




## రాగం-భావం

మనసులోని మౌనభావం
పలికించేదే రాగం
తనువులోని అణువణువును
కదిలించేదే భావం!

ఎండిమోడులై పగిలిన గుండెలు
కొండశిలలుగా పొగలిన ఎదలు
తలపు చిరుగులతొ
వలపు బిగువులతొ
పరిణమించితే - అది రాగం
పరవశించితే - అది భావం!

పలుకు పలుకులో జీవననాదం
చిలికించేదే భావం!

ప్రతిపదమంజుల శ్రుతిలో జతిలో
సమతను చాటేదే రాగం!
జీవన రాగం - మమతా భావం
కలసినచో - ప్రకృతి కావ్యం!

ఎద ఎద లోపల నిదురించే
మానవత్వమే మేలు కొలిపితే
అది ...... అమృత మధుర రాగం!
అణగారిన జనజీవనతతిలో
స్పందన కలిగిస్తే .... అది
అరుణ కిరణ భావం!

\- దినకర్